క్లుప్తంగా

నోటీసులు ఇచ్చి.. సర్వే చేయండి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పరిగి: రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భూసర్వే ఎలా చేస్తారని తహసీల్దార్ ఆనంద్‌రావుకు శనివారం లక్ష్మీదేవిపల్లి రైతులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నారాయణపూర్ సర్వేనంబర్ 157లో శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది రాజకీయ నాయకులు, సుగుణ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం దొడ్డిదారిన సర్వే నిర్వహించడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



స్వామివారిని దర్శించుకుంటున్న సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామివారికి శనివారం హిందూ వాహిని సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఇప్పటివరకు ప్రతీ శనివారం 44వారాల పాటు హనుమాన్ చాలీసా పారాయణం చేసినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలతో ప్రశాంతత చేకూరుతుందన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

అనంతగిరి: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల శనివారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్ జిల్లా అధికారి శంకర్‌నాయక్, కళాశాల ప్రిన్సిపల్ సురేశ్వరస్వామి, వీడీడీఎఫ్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు అప్ప విజయ్‌కుమార్, సురేష్‌గౌడ్, కేడర్, ప్రేమ్, శాంతకుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



పనులు ప్రారంభిస్తున్న స్వప్న, శ్రీలత

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. శనివారం ఆమె పట్టణంలోని 24వ వార్డులో వార్డు కౌన్సిలర్ సాహు శ్రీలతతో కలిసి డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో వార్డుల్లో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం చేపడతామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కౌన్సిలర్ సాహు శ్రీలత మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా పాండురంగ కాలనీ, మల్‌రెడ్డిపల్లి ప్రజలకు ఇబ్బందిగా మారిన డ్రైనేజీ, కల్వర్టు పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, బాలప్ప, డీఈ ఖాజా హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు సంతోష్, భీమ్‌శంకర్, కాలనీ వాసులు ఉన్నారు.

మెదడువాపు వ్యాధి సోకకుండా చర్యలు

ప్రధానోపాధ్యాయులు రాజేందర్ గౌడ్

దోమ: చిన్నపిల్లలకు మెదడువాపు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలుగా జేఈ (జపనీస్ ఎన్సెఫాలిటీస్) వాక్సినేషన్ వేయిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఖమ్మంనాచారం పాఠశాలలో చిన్నారులకు వైద్య సిబ్బందితో కలసి జేఈ వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తొమ్మిది నెలలు పూర్తయిన చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు జేఈ టీకా వేయించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కాంతమ్మ, ఆశవర్కర్లు శోభ, సత్యమ్మ, శివరాణి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యాయులు మెహర్‌చారి, అంగన్‌వాడీ టీచర్ అనిత, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో నిర్వేదం

తమ గ్రామాలకు సర్పంచులుగా ప్రాతినిధ్యం వహించాలని అనుకున్న కొంతమంది ఆశావహులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు యథాతథంగా ఉంటాయని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహ అభ్యర్థుల్లో తీవ్ర నిర్వేదం నెలకొంది. ప్రభుత్వం రోస్టర్ విధానం పాటించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అన్యాయమంటూ ఆవేదనకు గురవుతున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది.

- స్థానిక పోరుకు రిజర్వేషన్లు యథాతథం
- మాజీ సర్పంచుల్లో సంతోషం



కుల్కచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

కుల్కచర్ల: సొంత గ్రామాలకు సర్పంచ్‌గా ఎన్నికై సేవ చేద్దామని అనుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది. గతంలో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా మారుస్తారు. తమకు అవకాశం ఉంటుందని ఎదురుచూసిన నేతల ఆశలు అడియాశలయ్యాయి. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎన్నికలపై సమీక్ష నిర్వహించి రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగుతాయని, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ప్రకటించడంతో గ్రామాల్లో స్థానిక పోరుపై చర్చ మొదలైంది. సీఎం స్వయంగా నిర్ణయం చెప్పడంపై కొత్తగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికలకు వెళ్దామని అనుకున్న వారి కల కలగానే మిగిలిన పరిస్థితి ఏర్పడింది.

గతంలో ఇలా..

కుల్కచర్ల మండల పరిషత్‌లో 44 గ్రామపంచాయతీలుగా ఉండగా.. 2018 గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికలలో భాగంగా 18 గ్రామపంచాయతీల్లో ఎస్టీ రిజర్వేషన్‌కు కేటాయించారు. 4 ఎస్సీ కేటగిరి, 8 బీసీలకు అవకాశం కల్పించారు. 14 గ్రామాలను ఓపెన్ కేటగిరిగా నిర్ధారించారు.

కొత్త వారిలో అసహనం

స్థానిక ఎన్నిక సమయంలో తమకు అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చిన సందర్భంలో పార్టీ పెద్దలను ఒప్పించి పోటీలో నిలిచేందుకు ఆసక్తిగా ఉన్న కొందరు నాయకులు గత కొన్ని నెలల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం సమీక్షలో వెలువరించిన నిర్ణయంతో ఒక్కసారిగా నిర్వేదానికి లోనయ్యారు. గతంలో అవకాశం రాక, ఇప్పుడు అవకాశం లేకపోవడంతో మళ్లీ ఐదు సంవత్సరాల కాలం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో తీవ్ర అసహనానికి గురైనట్లు తెలుస్తోంది. ఏదైనా మార్పులు జరిగి రిజర్వేషన్లను మారితే బాగుండు అనుకుంటున్నారు.

మాజీ సర్పంచుల్లో కొత్తఆశలు

రిజర్వేషన్లు యథాతథంగా ఉండే అవకాశం ఉంటాయన్న వార్తలు రావడంతో కొన్ని గ్రామాల్లో మాజీ సర్పంచులు మళ్లీ అవకాశం వస్తుందన్న ఆశలతో ఉన్నారు. అవే రిజర్వేషన్లు ఉండటం, గత ఎన్నికల అనుభవం కలిసివచ్చే అంశంగా ఉంటుందని అనుకుంటున్నారు. గతంలో ఎక్కువ నిధులు రాకపోవడం, ఖాతాలు ఫ్రీజింగ్‌లో ఉండటం, కేంద్రం నిధులు రాష్ట్రం వాడుకోవడం, గ్రామపంచాయతీలో సగం అభివృద్ధి పనులు జరిగి ఉండటం వంటివి జరగగా అవి ఇప్పుడు ఉండే అవకాశం లేకపోవడంతో ప్రస్తుతం పదవియోగం లాభదాయకంగా ఉంటుందన్న ఆశలతో ఉన్నారు. పల్లెల్లో స్థానిక పోరుపై చర్చలు మొదలు కావడంతో మళ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది.

కొనసాగింపు మంచి నిర్ణయం



ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం తీసుకుంది. గతంలో తాము బీఆర్‌ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా గ్రామంలో అనుకున్న లక్ష్యాలను సాధించలేదు. నాటి అధికార పార్టీ నేతలు సహకరించకపోవడం వల్ల అభివృద్ధి ఆశించిన మేర జరగలేదు. ప్రస్తుతం పార్టీ మళ్లీ అవకాశం ఇస్తే అనుకున్న లక్ష్యాలను సాధించి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

– లక్ష్మి, మాజీ సర్పంచ్ ముజాహిద్‌పూర్

బీసీలకు తీవ్ర అన్యాయం



కులగణన చేయకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరగనుంది. జనాభా దమాషా ప్రకారం బీసీలకు సూమారు 15 సర్పంచుల స్థానాలు రిజర్వేషన్లలో దక్కాల్సి ఉండగా పాత రిజర్వేషన్లు కల్పిస్తే కేవలం 8 మందికి మాత్రమే బీసీలు సర్పంచులుగా ప్రాతినిధ్యం వహించాల్సి వస్తుంది. కులగణన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలి.

– మాసయ్య, చౌడాపూర్

ఆయిల్ పాం సాగుకు సబ్సిడీ

ఉద్యాన వనశాఖ అధికారి గఫూర్



ఉద్యానవనశాఖ అధికారి గఫూర్

మోమిన్‌పేట: రాష్ట్రంలో ఆయిల్ పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని ఉద్యాన వనశాఖ అధికారి గఫూర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆయిల్ పాం సాగు చేసే రైతులకు 100శాతం సబ్సిడీపై మొక్కలు, బిందు సేద్య పరికరాలను అందించనున్నట్లు చెప్పారు. తీగజాతి కూరగాయలను సాగు చేసే రైతులు శాశ్వత పందిరి వేసుకొనేందుకు 50శాతం సబ్సిడీని ఇవ్వనున్నట్లు తెలిపారు. మొక్కలు ఏపుగా పెరిగేందుకు, గడ్డిని నిలువరించేందుకు ఉపయోగపడే మల్చింగ్ వేసుకొనేందుకు కూడా ప్రభుత్వం 50శాతం సబ్సిడీని అందిస్తుందని అన్నారు. పండ్ల తోటలు అరటి, బొప్పాయి, జామ, మామిడి, నిమ్మ, సీతఫలం, పనాసా, నేరేడే తదితర తోటలో పెంపకానికి ఎంఐడీహెచ్(మిషన్ ఆఫ్ ఇంటిగ్రేటేడ్ డవలప్‌మెంట్ హార్టికల్చర్) పథకం కింద సబ్సిడీలను అందిస్తుందన్నారు. సబ్సిడీపై కూరగాయల నారును కూడా అందిస్తామన్నారు. అదే విధంగా వేసవికాలంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు షెడ్‌నేట్, ఉల్లి నిలువ గిడ్డంగి నిర్మాణం కోసం సబ్సిడీలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా మల్బరీ తోటల పెంపకం, షెడ్ నిర్మాణానికి రూ.2లక్షల సబ్సిడీ, అన్ని రకాల కూరగాయల సాగుకు బిందు, తుంపర సేద్య పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. చిన్న సన్నకారుల రైతులకు 90శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు 100శాతం సబ్సిడీపై అందిస్తుందని వివరించారు.

అమ్మ కోసం ఒక మొక్క



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుల్కచర్ల: ప్రతి విద్యార్థి తమ మాతృమూర్తి కోసం ఒక మొక్కను నాటి, సంరక్షించాలని కస్తుర్బాగాంధి బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అమ్మకోసం ఒక మొక్క అన్న ప్రధాని సూచనలను అనుసరించి విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భూమాత సస్యశ్యామలంగా ఉంటే పర్యావరణం ఆహ్లాదకరంగా, పచ్చగా ఉండాలని అందుకు మొక్కల పెంపకం అత్యవసరమని అన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇళ్ల దగ్గర మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. మండల పరిధిలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెద్దేముల్: ఊరూర వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దేముల్ ఉపాధిహామీ ఈసీ క్రిష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులు, గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 37 వనసర్సరీలు, ఒక్కో నర్సరీల్లో 5వేల మొక్కల చొప్పున సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు చొప్పున 45వేల మొక్కలు మండలానికి టార్గెట్ ఉందని తెలిపారు. నిత్యం వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం నర్సరీల్లో అల్లనేరడు, నిమ్మ, జామ, దానిమ్మ, ఉసిరి, పత్రి, వేపతో పాటు పలు రకాల చెట్లను అందచేయడం జరుగుతుందన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దేముల్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్యతో పాటు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరెంటు సమస్యలకు పరిష్కారం



విద్యుత్ స్తంభం, తీగలను పరిశీలిస్తున్న నాయకులు

యాలాల: గ్రామంలో కరెంటు సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా పేర్కొన్నారు. శనివారం యాలాల, గోవిందరావుపేట గ్రామాల్లో కరెంటు సమస్య పరిష్కారానికి మంజూరైన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 12 స్తంభాలు, తీగలను విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు. పనులను అక్బర్‌బాబా దగ్గరుండి పర్యవేక్షించారు. సుమారు రూ.12లక్షల విలువైన విద్యుత్ పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..కరెంటు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన రాజేందర్‌రెడ్డికి, అడిగిన వెంటనే కరెంటు సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు నాగయ్య, మోయిజ్, అహ్మద్, మారుతీ, అశోక్ నాయిా, శేఖర్, లాలు, నాగప్ప, బషీర్, మౌలాన ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామేశ్వర్ రెడ్డి

మర్పల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసేందుకకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గతంలో లేని విధంగా గ్రామాల్లో ప్రజలు బీజేపీకి ఓట్లు వేశారని, దీంతో మండలంలో రెండవ స్థానంలో బీజేపీ నిలిచిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి ఓటర్లను ఆకర్షించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ గ్రామాల్లో రైతులకు మాఫీ కాకపోతే రైతులకు అండగా నిలిచి రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవాలన్నారు. కొత్త రేషన్ కార్డుల, పింఛన్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామం నుంచి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలు లలిత, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలిసిన బాల్య మిత్రులు

కొడంగల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కలిసి ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. గడిచిన గత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు చదివిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని పరవశించారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ



ఆర్థిక సాయం అందజేస్తున్న రాజేశ్వరమ్మ

దోమ: పేదలకు కేఎస్ఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. శనివారం మండలంలోని మోత్కూర్ గ్రామానికి చెందిన ఎడ్ల అంజిలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుంచి ఎంతో మంది నిరుపేదలకు ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్నామని గుర్తు చేశారు. పేదవాడికి ఎలాంటి కష్టాలు ఎదురైనా ట్రస్ట్ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లయ్య, చెన్నయ్య, ఆనంద్, మొగులయ్య, మహేశ్, రాములు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో కొనసాగుతున్న పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని అంతారం, చెన్‌గేస్‌పూర్, ఎల్మకన్నె పాఠశాలలను సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని కమిటీ చైర్మన్లను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ నరోత్తంరెడ్డి, ఈసీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వీరప్ప, సత్యనారాయణరెడ్డిలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

బాలలను పనిల్లో పెట్టుకుంటే చర్యలు

ధారూరు: బాలలను పనుల్లో పెట్టుకుంటే యజమానులపై చర్యలు తీసుకుంటామని ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ధారూరులోని బీసీ బాలుర వసతి గృహంలో ఉన్న బాలల సంరక్షణ కమిటీల సభ్యులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. హోటళ్లు, కిరాణ షాపులు, ఇళ్లలో, వ్యవసాయ పనుల్లో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయిస్తే ఊరుకునేది లేదన్నారు. బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాలలపై దాడులకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ అడ్వకేట్ వెంకటేశం, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యుడు అలిమొద్దిన్, చైల్డ్‌లైన్ సభ్యురాలు మౌనిక, చంద్రమౌళి పాల్గొన్నారు.

పశువైద్యాధికారి బదిలీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ పశువైద్యశాల అధికారి డాక్టర్ నిజానంద్ బదిలీ అయ్యారు. గత 11 సంవత్సరాలుగా గొర్రెల, మేకలకు వైద్యం అందించారు. పూడూరు మండలం కంకర్ పశువైద్యాశాఖ అధికారిగా నిజానంద్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంక ఎవరిని నియమించలేదు.

శిక్షా సప్తహ్ కార్యక్రమం

దోమ: జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు శిక్షా సప్తహ్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి శిక్షా సప్తహ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పునాది అభ్యసనా, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఆరోగ్యకరమైన విటమిన్లతో కూడిన సమతుల్య ఆహారంపై చార్ట్‌లు తయారు చేయించి ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మెరుగైన విద్యను అభ్యసించేందుకు కృషి చేయాలన్నారు.

అమరులకు నివాళి

పరిగి: కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా శనివారం రాత్రి పారా మిలటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎక్స్ సర్వీస్ మెన్లు, పారామిలటరీ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దేశ రక్షణ జవానుల చేతుల్లో ఉందన్నారు. మనం వారి సేవలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ప్రజలు క్షేమంగా ఉన్నారంటే అది బార్డర్‌లో ఉన్న జవానుల త్యాగమేనని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత జవాన్లు, నాయకులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌కు సన్మానం

బంట్వారం: కోట్‌పల్లి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్‌కు స్థానిక యువకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. మండల ప్రజలు,నాయకులు సహకరించాలని కోరారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పూడూరు: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యువజన నాయకుడు ఎండీ అలీ అన్నారు. శనివారం సొంత ఖర్చులతో మండలంలోని కెరవెళ్లి గ్రామంలోని వార్డుల్లో గడ్డి మందు, దోమల మందును పిచికారీ చేయించారు. గ్రామంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొడంగల్: కల్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. అంగడిరాయిచూర్, అన్నారం, అప్పాయిపల్లి, చిన్న నందిగామ, చిట్ల పల్లి, కస్తూరుపల్లి, నాగారం, పర్సాపూర్, పెద్ద నందిగామ, ప్యాలమద్ది, రావులపల్లి, రుద్రారం, టేకుల్‌కోడ్, ఉడిమేశ్వరం గ్రామాలకు చెందిన 105 మంది లబ్ధిదారులకు రూ.1,01,88,064 చెక్కులను అందజేశారు.

కలాం ఆశయసాధనకు కృషి

కుల్కచర్ల: అబ్దుల్ కలాం ఆశయసాధనతో యువత ముందుకుసాగాలని చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

మర్పల్లి: ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య వంట ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని రావులపల్లి, తిమ్మాపూర్, పెద్దాపూర్, కల్‌ఖోడ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఆయన వెంట ఏపీ ఎం మధుకర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రూ.18వేల వేతనం ఇవ్వాలి

అనంతగిరి: ఆశవర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 679మంది ఆశవర్కర్లు ఉన్నారన్నారు. గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రమాద బీమా రూ. 50 లక్షలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, ఆశవర్కర్ల యూనియన్ నాయకులు మంగమ్మ, స్వరూప, వెంకటమ్మ, పాల్గొన్నారు.

ప్రమాదబీమా పాలసీతో లబ్ధి

తాండూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రమాదబీమా పాలసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం పట్టణాధ్యక్షుడు నరేష్ అన్నారు. శనివారం సాయిపూర్ పరిధిలోని పలువురికి అవగాహన కల్పించి, పాలసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టాఫీసులో ప్రీమియం ఖాతా తెరిచిన వారు సంవత్సరానికి ఒకసారి రూ.555 చెల్లిస్తే, రూ. 10లక్షల యాక్సిడెంటల్ కవరేజ్, రూ.755 చెల్లిస్తే, రూ. 15 లక్షల యాక్సిడెంటల్ కవరేజ్ వర్తిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం దీనిని రెన్యువల్ చేయించుకోవాలన్నారు. పాలసీ చేయించిన 15 రోజుల తర్వాత బీమా వర్తి స్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పాలసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: విద్యార్థులకు 'సంపూర్ణ ఆరోగ్యం.. సమతుల్య ఆహారం' అనే ఈసీఓ క్లబ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. నూతనంగా పాఠశాలలో ఈసీఓ క్లబ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికాంత్, వెంకటయ్య, మల్లయ్య, రమేశ్, గోపాల్ తదితరులున్నారు.

ఉపాధ్యాయవృత్తి ఎంతో గొప్పది

తాండూరు రూరల్: సమాజంలో ఉపాధ్యాయవృత్తి ఎంతో గొప్పదని మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అన్నారు. మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దస్తగిరిపేట్ పాఠశాల్లో 14 ఏళ్లుగా పని చేసిన విజయ్‌కుమార్ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారని అన్నారు. నూతన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మికి స్వాగత సన్మానం చేశారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కుల్కచర్ల: రైతుబీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మరికల్ వ్యవసాయ విస్తరణ అధికారి భావన తెలిపారు. శనివారం మరికల్ రైతువేదికలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. మరి కల్ క్లస్టర్ పరిధిలోని రైతులు 14ఆగస్టు1965 నుంచి 14ఆగస్టు 2006 మధ్య పుట్టిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.